క్లుప్తంగా

పలువురికి ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: మండలంలోని తిమ్మాయిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ధైర్యంగా ఉండాలంటూ ఆర్థిక సాయం అందించారు. ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ కోరే సుబ్బారావు, నాయకులు వెంగళరెడ్డి, నారాయణరెడ్డి, కోటేశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి ఉన్నారు.

కిల్కారీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తాళ్లూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిల్కారీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు అమిత్, భూషణ్, కిరణ్ అన్నారు. మండల కేంద్రం తాళ్లూరు ప్రైమరీ హెల్త్ సెంటర్లో కిల్కారీ అమలు తీరును గురువారం పరిశీలించారు.

కూడలిలో కనిపించని సూచిక బోర్డులు


సూచిక బోర్డు లేక షాపులోకి దూసుకెళ్లిన లారీ (ఫైల్)

● అయోమయంలో కొత్తగా వచ్చే వాహనదారులు


సూచిక బోర్డు లేని హైదరాబాద్-శ్రీశైలం రోడ్డు

పెద్దారవీడు: మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో కూడళ్ల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేవు. దీంతో ఆయా రోడ్లపై కొత్తగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని దేవరాజుగట్టు జంక్షన్‌లో జాతీయ రహదారులపైకి వీలుగా తారు రోడ్డు ఉంది. కడప, నంద్యాల, మార్కాపురం, ఒంగోలు, తిరుపతి, గుంటూరు, హైదరాబాద్, కర్నూల్, శ్రీశైలం తదితర ప్రాంతాలకు ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. సూచిక బోర్డులు లేకపోవడంతో ఎటు వైపు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, వాహనదారులు ఎటు వైపు వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఎలాంటి సూచిక బోర్డులు లేవు. కూడళ్ల వద్ద గ్రామాలు, పట్టణాల పేర్లను తెలిపే సూచిక బోర్డులు లేకపోవడంతో పగలు, రాత్రి సమయంలో కొత్తగా వచ్చే వాహనదారులు దారి తప్పి ఒక ఊరికి బదులు మరో ఊరికి వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కూడలిలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారులు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు కేటాయిస్తున్నా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు రెండు నెలల క్రితం కనిగిరి ప్రాంతం నుంచి బత్తాయి లోడుతో బ్రిడ్జి కింద నుంచి మూల మలుపులో హైదరాబాద్ వెళ్తోంది. తెల్లవారుజామున లారీ డ్రైవర్‌కు రూట్ అర్థంగాక నేరుగా బత్తాయి లారీ షాపుల ముందున్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి ముందుకు దూసుకెళ్లింది. స్తంభాలకు ఏర్పాటు చేసిన కరెంటు తీగలకు నిప్పు రవ్వలు కిందపడ్డాయి. అ సమయంలో షాపులో ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

దేవరాజుగట్టు గ్రామం జంక్షన్‌లో గ్రామానికి వచ్చే దారిలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎలాంటి బోర్డులు లేవు. ఈ ప్రాంతంపై అవగాహన లేని లేని వారు. కొత్తగా వచ్చిన వాహనదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు కూడలి వద్ద ఇబ్బంది పడుతున్నారు. దారి తప్పి ఇతర ప్రాంతాలకు వెళ్లి మళ్లీ కూడలికి వచ్చి వెళ్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాహనదారులు ఇబ్బందులు పడకుండా పట్టణాల పేర్లతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– కాసు వెంకటరెడ్డి, పెద్దారవీడు

అటవీ అమరులకు ఘన నివాళి


అటవీ అమరులకు నివాళులర్పిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: విధి నిర్వహణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన అటవీ శాఖ సిబ్బంది సేవలు మరువలేనివని పెద్దదోర్నాల, కొర్రప్రోలు ఫారెస్ట్ రేంజి అధికారులు హరి, ఖాజామెహిద్దీన్ పేర్కొన్నారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో గురువారం జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. విధి నిర్వహణతో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది సేవలను వారు కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అమరులైన 23 మంది అటవీశాఖ సిబ్బందికి వారు నివాళులర్పించారు. ఇందులో భాగంగా మార్కాపురం డివిజన్ పరిధిలోని శ్రీశైలం రహదారిలో ఉన్న గణపతి చెక్ పోస్టు వద్ద విధి నిర్వహణలో ఒకేరోజు అమరులైన రాజారావు, ఖాదర్, కృష్ణయ్యతో పాటు పాదిలి వద్ద మృతి చెందిన షమీమ్ బాషా సేవలు కొనియాడారు. అటవీ శాఖ సెక్షన్ అధికారులు, డీఆర్వోలు, బీట్ ఆఫీసర్‌లు, అసిస్టెంట్ బీట్ అధికారులు, ప్రొటెక్షన్ వాచర్లు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

262 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు


విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస గౌడ్

యర్రగొండపాలెం: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో 262 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి.శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ మానవ శరీరంలో అన్ని అవయవాల్లో నేత్రాలు ప్రధానమని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కంటి చూపు కోసం ఆకుకూరలు, కూరగాయలు ఆహారంగా తీసుకోవాలని, కళ్లలో నలకలు పడినప్పుడు నలపకుండా చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలని, వైద్యులను సంప్రదించాలని సూచించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.తిరుమలా దేవి, ఉపాధ్యాయులు సునంద, జ్యోతి, ఫ్లారెన్స్, మస్తాన్‌బీ, మేరీ, సుజాత, సక్కుబాయి, గురవమ్మ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి


రైతు సమస్యలపై మాట్లాడుతున్న నాయకులు

త్రిపురాంతకం: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని, సంఘ నియోజక వర్గ సమావేశాలు విజయవంతం చేయాలని రైతు సంఘ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నెల 14వ తేదీ ఆదివారం ఎర్రగొండపాలెంలో రైతు సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎరువులు, యూరియా సైతం అందించలేని స్థితిలో ఉందని, ఇది దారుణమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు ఈ ప్రభుత్వంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే తీర్చాలన్నారు. రైతులకు రుణాలు అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి ప్రభుత్వం ద్వార వచ్చే రాయితీలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి వీరారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి బి.రామయ్య, రాష్ట్ర నాయకులు డి. శ్రీనివాస్, సీపీఐ నాయకుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

రైతుల వెన్ను విరుస్తున్న కూటమి సర్కార్


అలవలపాడులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కురిచేడు: కూటమి సర్కార్ రైతుల వెన్ను విరుస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కురిచేడు మండలం అలవలపాడు, పడమర వీరాయిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ సుబ్బయ్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కి హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ వింగ్ అధ్యక్షుడు వీరగంథం కోటయ్య, నుసుం ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పోకూరి సుబ్బారావు, తాళ్లూరి ఆంజనేయులు, ఊట్ల పోలయ్య, కొండమీద హనుమంతరావు, ఆళ్ల గోవిందు, మన్నెం అశోక్, చామర్తి చిరంజీవి, మానం బాలా గురవయ్య, ఊట్ల ఆంజనేయులు, వీరగంథం వెంకట్రావు, రావి వెంకట్రావు, గూడూరి సాల్మన్, జగసానిగుట్ల నాగేశ్వరరావు, గూడూరి శాంసన్, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు .

పశువులు కోల్పోయిన వారికి నష్టపరిహారం


పశు యజమానులకు చెక్కులు అందిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: నల్లమల అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లి వన్య ప్రాణుల దాడుల్లో చనిపోయిన పశువులకు సంబంధించి ఆయా పశువుల యజమానులకు అటవీ శాఖాధికారులు నష్ట పరిహారం చెక్కులు అందజేశారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గంగాధర్ పాల్గొని బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. మర్రిపాలెం గిరిజన గూడెంలోని కుడుముల నాగమ్మకు చెందిన రెండు పశువులు వన్యప్రాణుల దాడిలో మృతి చెందటంతో రూ.20 వేలు, రూ.25 వేల చెక్కులు ఆమెకు అందజేశారు. దీంతో పాటు అదే గూడేనికి చెందిన కుడుమలు వెంకటేశం, కుడుముల వీరన్నలకు చెందిన పశువులు మృతి చెందటంతో చెరో 25 వేల రూపాయాల చెక్కులు అందజేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గంగాధర్, పశు పోషకులు పాల్గొన్నారు.

మాదిగలకు శ్మశాన స్థలాన్ని కేటాయించాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సంఘ పెద్దలు

కురిచేడు: మండలంలోని పెద్దవరం మాదిగ పల్లెలో 100 కుటుంబాలకు నేటికీ శ్మశాన వాటిక లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గతంలో ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులకు శ్మశాన స్థలం మంజూరు చేయాలని కోరినట్లు గ్రామస్తులు తెలిపారు. పెద్దవరం గ్రామంలోని సర్వే నంబర్ 101/1, 95/6, 74లో శ్మశాన వాటికకు అనువైన గ్రామ కంఠం ఉందని, సర్వే నంబర్ 95/6లో విస్తీర్ణం 7.32 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిని శ్మశాన వాటికకు కేటాయిస్తే తమకు అనుకూలంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. గురువారం తహసీల్దార్ జి.రజినీకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. యర్రగుంట్ల ఇమ్మానుయేల్, మాగులూరి రామయ్య, సోమవరపు ఇశ్రాయేల్, మక్కెనకొండ గురవయ్య, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి


దొనకొండలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

దొనకొండ (కురిచేడు): సీఐటీయూ జిల్లా 13వ మహాసభలు నవంబర్ 7, 8, 9 తేదీల్లో దర్శిలో మొదటి సారిగా జరుగుతున్నాయని, నియోజకవర్గంలోని 5 మండలాల ఉద్యోగ, కార్మిక, ప్రజలందరూ సహకరించి జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు, దొనకొండ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ జిల్లాలో అసంఘటిత రంగం, స్కీమ్ వర్కర్స్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, 8 గంటల పని విధానం, పీఎఫ్, ఈఎస్ఐ, సంక్షేమ పథకాలు అమలు కోసం పోరాటాలు చేస్తోందన్నారు. బిల్డింగ్, ముఠా, ఆటో, ఆశా, అంగన్‌వాడీ రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమ్మెలు, ఆందోళన, పోరాటాలు చేసి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంటామని తెలిపారు. సీఐటీయూ చేసిన పోరాటాలను ప్రభుత్వ విధానాలు, ప్రజలకు ఉపాధి అంశాలు చర్చించి సమీక్షించుకుని నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటామని, భవిష్యత్‌లో జరిగే సమస్యల పరిష్కారం కోసం పోరాటాల రూపకల్పనకు దర్శి వేదిక అవుతుందన్నారు. దొనకొండ, కురిచేడు, దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు కార్యకర్తలంతా ఐక్యంగా సభలు విజయవంతం చేయాలని రంగారావు కోరారు. సీఐటీయూ నాయకులు చిరుపల్లి అంజయ్య, కుందుర్తి చిన్న నరసింహులు, కర్నా హనుమయ్య, అంజనేయులు, ఉదయ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభ అట్టర్ ఫ్లాప్


బండి వెలిగండ్లలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


దర్శి: కూటమి ప్రభుత్వం అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్ సభ అట్టర్ ఫ్లాప్ అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని బండి వెలిగండ్ల, లంకోజనపల్లి, ఎర్రఓబనపల్లి గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలనుపూర్తి స్థాయిలో అమలు చేయకుండా సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అని చెప్పడం దారుణమని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డుల ద్వారా ప్రజలకు వివరించారు. రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు బుజ్జి, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు బాబూరావు, బీసీ సెల్ అధ్యక్షుడు అంకాల శ్రీను, ఆర్‌ఆర్‌ఆర్ రవి, సర్పంచ్‌లు కైపు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రభుత్వం అండగా ఉండాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున యూటీఎఫ్ నాయకులు

దర్శి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక పరమైన విషయాలపై ప్రభుత్వం అండగా ఉండాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీను, బి.రాజశేఖర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణబేరి పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం అండగా లేక పోవడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. నాలుగు డీఏలు బకాయిలున్నా కనీసం ఒక్కటి కూడా ప్రకటించక పోవడం, పీఆర్‌సీ గడువు పూర్తి అయినా చైర్మన్‌ను నియమించక పోవడం, కనీసం ఐఆర్ కూడా ప్రకటించకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. పీఆర్సీ అరియర్లు, డీఏ అరియర్లు ఇవ్వక పోవడం ఉపాధ్యాయ వర్గాలను తీవ్రంగా కలచివేస్తోందన్నారు. సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు ఉపాధ్యాయులు రణబేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సంక్షేమ డైరెక్టర్ విజయ్‌కుమార్, అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాసిం, సహాధ్యక్షుడు రామారావు, ప్రవంతి, మహిళా కార్యదర్శులు నరసమ్మ, పద్మశ్రీ, కోశాధికారి రామారావు, సీనియర్ నాయకులు రామిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు యలమందారెడ్డి, రామాంజనేయులు, కృష్ణారెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలి


మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

దర్శి: అంతరాయాలు లేని మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. స్థానిక శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో దర్శి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

తీగల కింద ఉన్న చెట్లు తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండి వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందించాలని ఆదేశించారు. దర్శి డీఈ పి.శ్రీనివాసరావు, డీఈఈ రవికుమార్, ఏఈలు పాల్గొన్నారు.

వెయ్యి మొక్కల పంపిణీ



దర్శి: పట్టణంలోని శివరాజ్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మానవతా సేవా సంస్థ కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గొర్రెపాటి వేణు 1000 మొక్కలు గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలో మానవత సేవా సంస్థ ప్రతినిధులు మొక్కలు నాటారు. రాబోయే వర్షాకాలంలో శివరాజనగర్, శాంతి నగర్‌లో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి రఘురామయ్య మానవత సభ్యులను అభినందించారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి కాశీ చేతన్, పాఠశాల చైర్మన్ నారాయణ, మానవతా సేవా సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, జిల్లా కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు చీదెళ్ల బసవయ్య, సంస్థ డైరెక్టర్లు సుబ్బారావు, సుశీలమ్మ, సంగు ఏడుకొండలు, డి.నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు ఖాదర్ వలీ, మరియమ్మ, బీబీజాన్, సుజాత, సంధ్యారాణి పాల్గొన్నారు.